# ఈ వారం కథ

ఎ.వి. రమణ ప్రసాద్

ఈనాడు సమాజంలో 'నీతి'గా బతకడమంటే, ఇతరుల ముందు తను పనికి మాలినవాడిగా నిరూపించుకోవడమే. ఇతరులే కాదు, తను పనికిమాలిన వాడిగా తనే అనుకునేట్లు చేస్తుంది. అయితే, తన 'నీతి'ని గుర్తించి గౌరవించే వాళ్ళున్నట్టు తెలిస్తే ఎంత సంతోషం!

## సర్వధారి స్వయంకృతమ్



అదేమిటోగానీ కొంత మందికి మండలాఫీసు దగ్గర్నుంచీ హైదరాబాద్‌లో సెక్రటేరియట్ వరకు ఏ పనైనా సరే చకచకా జరిగిపోతూ వుంటుంది. దానికి వాళ్ళ లౌకికం, వాక్చాతుర్యం, కలుపుగోలుతనం, చొరవ, తెలివి తేటలు కారణమేమో!

నా ఖర్మ. అదేంటో గానీ ప్రతి పనికీ బ్రేకే. పైగా చేతి కందింది నోటికందదన్నట్లు చివరి దశలో ఏ సైంధవుడో అడ్డు పడడమో, లేక నా మాటలే తూటాలై నాకే గుచ్చుకోవడమో జరుగుతూంటుంది. స్థిమితంగా ఆలోచిస్తే తప్పంతా నాదే. నా ప్రవర్తనే నాకు శత్రువు అని అనిపించడం కూడా కద్దు. నాకు మాట్లాడ్డం చేతకాదనీ, పనులు జరిపించుకునే టెక్నిక్ తెలియదనీ నాకు తెలుసు. మొన్నటికి మొన్న గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఏ.ఎస్.ఎం.తో పేచీ, బెర్తులు గానీ, సీట్లు కానీ ఏవీ ఖాళీ లేవన్నాడు. 'వేకెన్సీ వస్తే ఒక బెర్తు గానీ ఒక సీటుగాని సర్దండి ప్లీజ్' - అన్నాను. నాకు తెలిసి అతన్ని రిక్వెస్టు చేసిన వాళ్ళల్లో నేనే ప్రథముణ్ణి. 'చూద్దాంలే' అంటూ ఎటో వెళ్ళిపోయాడు. కాసేపటికి చుట్టూ అయిదారు మంది మనుషుల్తో ఖూనీ కేసుపుచ్చుకున్న వకీలు మల్లే నడుస్తూ వస్తున్నాడు. ఆ తర్వాత తెలిసింది. నా వెనక అడిగిన వాళ్ళు ఓ నలుగురైదుగురికి కొద్ది బెర్తులూ , సీట్లూ ఇచ్చాడని. నిలదీసి ప్రశ్నించాను. గొంతు పెంచాను. అలాంటి సందర్భాల్లో ఎక్కడ దాక్కొని వుంటుందోయేమో గాని అనర్గళంగా ఆంగ్ల భాషా పాటవం ప్రదర్శించడం నాకల వాటే. "చూడు మిస్టర్! నే కివ్వను. ఇంకో సీటుంది. అది కూడా ఇదిగో ఈ పెద్ద మనిషికిస్తున్నాను.నీకు దిక్కున్న చోట చెప్పుకో. నీ ఇష్టమొచ్చింది చేసుకో. రూల్సు మాట్లాడుతాడు రూల్సు. ఇదిగో ముందు రిజర్వేషన్ కంపార్ట్‌మెంటు దిగి జనరల్ బోగీ ఎక్కు" అని గద్దించాడు ఏ.ఎస్.ఎం. ఆ ప్లాట్ ఫారం మీద నేను తప్ప ఎవ్వడూ ఆయనతో ఘర్షణ పెట్టుకో లేదు. నేను తప్ప ఎవ్వడూ రిజర్వేషన్ బోగీ దిగి జనరల్ కంపార్ట్ మెంట్‌లోకి మకాం మార్చనూ లేదు.

ఓసారి మా బావగారు (మా అక్క మొగుడే) తన కొడుకేదో డెసర్టేషన్ ఎం.ఫిల్ కోసం సబ్మిట్ చేయాలని, జాబ్ వర్క్ వాళ్ళకిస్తే అంతా తప్పులుకొడతారని తామే సొంతంగా టైపు చేసుకోవడం కోసం తన ఆఫీసు నుంచీ టైప్ రైటర్ తీసికెళ్ళి ఓ వారం రోజులు ఇంట్లో పెట్టుకున్నాడు. ఆ వారం రోజుల్లోనూ అయి

దారు రోజులు ప్రభుత్వ సెలవులే. మిగిలింది శనివారం అరపూట కాగా పని దినం ఒక్క రోజు మాత్రమే. ఆ ఒక రోజూ ఆఫీసరడిగితే ఏదో సర్ది చెప్పొచ్చులే అనే ధీమాతో మా బావ టైప్ రైటర్ ఇంటికి పట్టుకెళ్ళాడు. ఇంతలో అదే ఆఫీసులో కాగితమొకటి నాదే టైప్ కావలసి వచ్చింది. 'మన బావగారే కదా!' అని సర్దుకొని పోయుంటే ఏ గొడవా వచ్చి వుండేది కాదు. ఎప్పుడైతే ఆఫీస్ టైప్ రైటరు ఇంటికి తీసి కెళ్ళాడని తెలిసిందో నాకు ఒళ్ళు మండింది. అధికార దుర్వినియోగం చేసిన నా బంధువు పట్ల అసహ్యం పెరిగి పోయింది. లోకాన్ని ఉద్ధరించే మనస్తత్వంతో వెంటనే ఆఫీసరుకు రిటన్ స్టేట్‌మెంటిచ్చి నిముషాల్లో ఆ టైప్ రైటర్ ఆఫీసుకు తెప్పించి మా బావగారికో శ్రీ ముఖం వచ్చేలా చేశాను. వాళ్ళింట్లో ఆడవాళ్ళు మొదలుకొని మా ఇంట్లో పిల్లలు కూడా తిడుతూ వుంటే ఏదో నిజాయితీ సూత్రాలు వల్లిస్తున్నానే కానీ లోలోపల నా బుద్ధిని నేనే అసహ్యించుకున్నాను.

కొన్ని సందర్భాల్లో నేరస్తుడెవడో తెలియనప్పుడు కూడాఆవేశంతో మనసులోనే ఊగిపోవడం, కనిపిస్తే కాల్చేద్దామా అని అనిపించి ఆ తర్వాత ఏ ఫ్రూటీనో త్రాగి చల్లబడి మరచిపోవడం కూడా నాకు మామూలే.

మొన్న మా పక్కింటి మేష్టారొకాయన మా ఇంటికొచ్చి "డిపార్ట్‌మెంటల్ పరీక్షల రిజల్ట్స్ వచ్చాయట. నేను ఎస్.ఓ. టెస్ట్ పార్ట్ వన్ వ్రాశాను. నా నంబరు చూసి వద్దాము. అలా కలెక్టర్ ఆఫీసు వరకు వెళ్దాం వస్తారా!" అని పిలిస్తే ఆయనతోపాటు నేనూ వెళ్ళాను. ఆఫీసు సూపరింటెండెంట్‌గారు రిజల్ట్స్ రికార్డు మా చేతికిచ్చి చూసుకోండన్నారు. తీరా చూస్తే ఆ మేష్టారుగారి నంబరు వుండాల్సిన పేజీ అందులో లేదు. ఆ పేజీ పేజీనే ఎవరో చింపేసి తీసికెళ్ళారనిపించింది. సూపరింటెండెంట్‌గారినడిగితే "ఏం చేస్తాం చెప్పండి. అలాగున్నారు మనవాళ్ళు. బాధ్యతగల ఉద్యోగస్తులయ్యుండి కూడా పది మందికీ ఉపయోగపడే రికార్డును చింపేసి తీసికెళ్ళడం ఎంతటి సంస్కారమో చూడండి! అరే! ఈ రికార్డును చించి తీసికెళ్ళడం వల్ల మనకొచ్చే లాభమేమిటి? దీనివల్ల ఎందరికో ఇబ్బంది కల్గిస్తున్నాం కదా. అన్న ఇంగిత జ్ఞానం కూడా లేకపోతే ఎలాగండి! పైగా చదువుకున్నవాళ్ళు!" అని సూపరింటెండెంట్ నిలదీసి ప్రశ్నిస్తుంటే నాలో నరం నరం ఉద్రేకంతో ఉబికి పోయింది. ఆయన చెబుతున్న ప్రతి డైలాగుకీ ఒక్కో మెట్టు ఆవేశం నాలో కట్టలు తెంచుకొని ప్రవహించింది. కానీ ఏం లాభం ఆ దుర్మార్గుడు ఎవడో ఏమో?

## కోతికి కొబ్బరి కాయ

మలయా ద్వీపకల్పంలో కొబ్బరికాయల్ని చకచకా ఎవరు కోస్తారో తెలుసా? కోతులు. మలేసియాలో ఏడాదికి నూట ఇరవైఐదు మిలియన్ల కొబ్బరి కాయలు పండుతాయి. ఎండకి నెత్తి చుర్రుమనేట్లు సూర్యుడు తన ప్రతాపం చూపకముందే బాగా శిక్షణ పొందిన కోతి 300 నుంచి 400 కొబ్బరి కాయల్ని టపటపా చెట్టుమీంచి తెంపి క్రిందకి రాల్చేస్తుందిట! కోతికి ఎలా శిక్షణ ఇస్తారో చూడండి. కొబ్బరికాయుని ఎలా మెలితిప్పితే త్వరగా చెట్టు నుంచి ఊడుతుందో మొదట కోతికి బాగా అర్థమయ్యేలా చూపుతారు. ఆ తర్వాత కోతిచేతులకి స్వయంగా కొబ్బరికాయుని పట్టించి మెలితిప్పేలా చేస్తారు. కోతిని మెచ్చుకుంటూ కొబ్బరిని పగల గొట్టి దాని శిక్షకుడు, శిష్యుడు ఇద్దరూ భక్షిస్తారు. తర్వాత చెట్టుకి కొద్ది క్రిందగా కొబ్బరి కాయను వ్రేలాడదీసి కోతి చెట్టుపై పాకి తెంపేట్లు చేస్తారు. బాగా పక్వాని కొచ్చిన కాయను కోతి తెంచేట్లుగా నోటి శబ్దాల ద్వారా సూచనలిస్తారు. ఇలా 20 రోజుల శిక్షణ పొందిన ఈ మర్కటం తల్లి మాట వినే మంచి బాలునిలా యజమాని మనసెరిగి ప్రవర్తిస్తుంది. —సేకరణ: అచ్యుతుని రాజ్యశ్రీ

మనసులోనే నానా రకాలుగా ఈసడించుకొని బయటికొచ్చేశాను.

ఈ విధంగా ఇలాగే ఆర్.టి.సి. బస్సులో కంప్లైంట్ బుక్కడిగి తీసుకొని చెడమడా రాసేసి సంతకాలు పెట్టడం ప్రభుత్వాస్పత్రుల్లో కాంపౌండర్లనూ, నర్సుల్నీ ఓ ఊపు ఊపడం, ఆఫీసుల్లో గుమాస్తాల్తో రెండు ముక్కలే మాట్లాడి ఆఫీసర్లతో వాదించి చివరకో ఫిర్యాదు వ్రాసిచ్చి రావడం, తిరుపతి కొండ మీద కూడా క్యూలో మొదలుకొని లడ్డూల వరకూ పోట్లాడ్డం, హోటళ్ళల్లో సర్వర్లపై చిందులేసి క్యాషియర్‌కు రిపోర్టివ్వడం, ఇంకా చాలా చాలా స్థలాల్లో ఆయా నిర్వాహకులను నిలబెట్టి కడిగేసి ఇంకా అవసర మనుకుంటే ఓ కాగితమ్ముక్క తగిలించడం నా కలవాటే. అందుకే నాకు ఎక్కడైనా పనులు జరిగిన సందర్భాల కంటే విరిగిన సందర్భాలే ఎక్కువ. అసలీ కాలంలో 'నొప్పించక, తానొవ్వక నప్పస్సి తిరుగువాడె చతురుడు' కదా! ఆ కార్య సాధనా శక్తి మనకు పూజ్యం.

ఈ రకం మనస్తత్వం ఎప్పుడో ఒకప్పుడు నా కొంప ముంచుతుందని నాకు తెలుసు. అప్పుడప్పుడూ నాకు నేనే హెచ్చరించుకుంటూ వుంటాను కూడా. కానీ ఏం చేస్తాం! కుక్కతోక. పుట్టుకతో వచ్చిన బుద్ధి. ఆ! పుట్టుకంటే గుర్తొచ్చింది. అరవై సంవత్సరాలుండగా వెధవది ఆ సంవత్సరంలోనే నేను పుట్టాలా? పుట్టేటివిదో మా తాత నాకు ఆ పేరే ఎందుకు పెట్టవలె? పైగా ఎవ్వడూ పెట్టుకోని వినూత్న నామధేయం 'సర్వధారి'

* * *

సురేష్ ఎందుకు రాలేదు? తప్పకుండా పిలుచుకొని వస్తానన్నాడు. తీరా ఇన్ని ప్రయత్నాలు చేసుకున్నాక ఎందుకిలా చేశాడు? మధ్యాహ్నం ఒంటి గంట దాటుతోంది. అలా చేసేవాడు కాడే!

సురేష్ మా ఆఫీసులోనే నా కొలీగ్. "మీ సౌజన్య బి.ఎస్‌సి. కాబట్టి నో ప్రాబ్లం రా! అందులోను మేథమేటిక్స్ మెయిన్. మా ఊళ్ళో మా ఫ్రెండ్ బ్రదరున్నాడు, పేరు భానుమూర్తి. హైస్కూల్లో లెక్కలు మాస్టారు. బళ్ళో సంపాదించే మూడు వేలూ కాకుండా బయట మరో నాలుగు ఇన్స్టిట్యూట్స్‌లో ట్యూషన్లు చెబుతూ ఇంకో మూడు వేలు సంపాదిస్తాడు. తన కాబోయే భార్య కూడా ఏ మేథమేటిక్స్ గ్రాడ్యుయేటో అయితే తానే సొంతంగా ఓ ట్యుటోరియల్ ఇన్స్టిట్యూట్ నడుపుకోవచ్చని అతను భావిస్తున్నాడు. అతనికి అమ్మాయి అందచందాలతో పని లేదట. కట్న కానుకలు కూడా పెద్దగా అడగడు. కాబట్టి నూటికి నూరు పాళ్ళూ నీ చెల్లెలికీ సంబంధం ఖాయమైనట్లే. నీకెందుకూ, కుదిరించే బాధ్యత నాది. ఇదిగో! ఆ మేష్టారుకి ఆదివారం తప్ప ఇంకెప్పుడూ ఖాళీ వుండదు. కాబట్టి రేపు ఆది వారం ఉదయం ఎనిమిది గంటలకల్లా ఆ అబ్బాయినీ వాళ్ళ పెద్ద వాళ్ళనీ పిలుచుకొని వస్తాను. పెళ్ళి కొడుకు సరే అంటే వీలయితే తాంబూలాలు కూడా పుచ్చేసుకుందాం. ఎందుకైనా మంచిది సిద్ధంగా వుండు. నేను పిలుచుకొని రావడం గ్యారంటీ" అని ఇంత ఖచ్చితంగా చెప్పిన సురేష్ ఎందుకు రాలేదు?? పైగా మా గురించి వాళ్ళతో ఇదివరకే ప్రస్తావించానన్నాడు కూడా. సురేష్ మర్చిపోయాడు. మాట తప్పడు. మరెందుకిలా జరిగింది? అంటూ ఆలోచిస్తూ బయటకొచ్చాను. ఇంతలోమా ఆఫీసు అటెండరు అప్పారావు నా ఇంటి వైపే వస్తున్నాడు.

ఈ మధ్యనే బెజవాడలో మా బాబాయి గారింటి కెళ్ళిన సౌజన్యను పెండ్లి చూపుల కోసం పిల్చుకొని రావడానికని నేను రెండు రోజులు ఆఫీసుకు సెలవు పెట్టాను. నేనెప్పుడు డ్యూటీకి వెళ్ళకున్నా ఆఫీసుకొచ్చే ఉత్తరాలు ఇంటికి తెచ్చి ఇస్తూ వుంటాడు అప్పారావు. అప్పారావు విష్ చేసి ఓ కవరు నా చేతికిచ్చి "నిన్న వచ్చింది సార్!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అఫిషియల్ లెటర్‌లా వుందేమిటా? అని

## మూర్ఖం మార్కు - మార్కులు

ఆంధ్ర సాహితీ మూర్తులలో పింగళి, కాటూరి, విశ్వనాథ, జాషువా వంటి మహామహులెందరో ప్రసిద్ధ సాహితీవేత్తలుగా గుర్తింపబడి, జనబాహుళ్యానికి తెలిసినా, కొంచెం ఇంచుమించు అంతటి సామర్థ్యాన్ని కలిగివుండి కూడా ప్రచారం లేక తెరమరుగున వుండిపోయి జనబాహుళ్యానికి తెలియని మహా పండితులూ, విద్వాంసులూ, కవులూ కూడా కొందరున్నారు. అలాంటి వారిలో దాదాపు మూడు దశాబ్దాలు భీమవరం కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా పనిచేసి దివంగతులైన శ్రీ దిగుమర్తి సీతారామస్వామిగారు ఒకరు.

ఆయన అత్యంత ప్రతిభావంతులు, రసహృదయులు, చక్కని కవి, కవితా స్వారస్యం తెలిసిన విమర్శక శిఖామణి. అన్నింటికంటే చమత్కారంగా మాట్లాడ్డంలోనూ, మాటల్తో మొండిగా వాదించే ఎదుటి వ్యక్తి నోరు మూయించడంలోనూ బహు నేర్పరి.

ఓమారు నలుగురైదుగురు లెక్చరర్ల మధ్య వాదన పడింది. "లెక్కలు, సైన్సు వంటి సబ్జెక్ట్సులో నూటికి నూరు మార్కులు వెయ్యొచ్చు కాని, ఎంత గొప్పగా రాసినా తెలుగు, ఇంగ్లీషు వంటి సబ్జెక్ట్సులో నూటికి ఎనభై, ఎనభై అయిదు కంటే వెయ్యకూడదు. ఎందువల్లనంటే, వాటికి పరాకాష్ఠ అంటూ లేదు కనుకా, ఎంత బాగా వ్రాసినా ఇంకా బాగా వ్రాయవచ్చు కనుకాను" అని. కాని ఒక లెక్చరర్‌గారు మొండిగా మూర్ఖంగా అడ్డంతిరిగి "అదేం కాదు. తెలుగులో కూడా నూటికి నూరు వెయ్యొచ్చు. నేను వేశాను" అంటూ వాదించసాగారు. ఎవరు ఎంతగా నచ్చచెప్పినా వినడం లేదు.

ఆ సమయంలో సీతారామస్వామిగారు డిపార్ట్‌మెంటు రూమ్‌లోకి వచ్చారు. వాదించుకుంటూన్న వాళ్ళల్లో ఒకాయన పూర్వాపరాలు చెప్పకుండా "అయ్యా! తెలుగులో నూటికి నూరు వెయ్యొచ్చా?" అనడిగారు. వెంటనే దిగుమర్తివారు "ఆ... వేస్తే వెయ్యొచ్చు. అయితే అది ఆ పేపరు దిద్దేవాడి అజ్ఞానం మీద ఆధారపడి వుంటుంది" అన్నారు. దాంతో, మొండివాదన చేస్తూన్న లెక్చరర్ గారి నోరు మూతపడింది.

—పోలాప్రగడ

అనుకుంటూనే కవరు చించాను. అది జిల్లా కలెక్టరు సురేష్‌కిచ్చిన మెమో. ఇన్ఫర్మేషన్ కోసం నాకో కాపీ పెట్టారు.

సంధ్య టైపిస్ట్‌గా మా ఆఫీసులో చేరి సంవత్సరమే అయింది.

అలా చేరి వారం అయిందో లేదో సంధ్య ఆఫీసు ఆఫీసంతా తన సమ్మోహనాస్త్రంతో అదరగొట్టేసింది. మ్యాచింగ్ డ్రస్సుల్లో ట్రిమ్ముగా తయారై ఫారిన్ సెంటు గుమగుమల్తో ఆఫీసులో అడుగు పెట్టే ఆ సంధ్యా దర్శనం కోసం ఏ దాపరికమూ లేకుండా ఎదురు చూచే వాళ్ళే కాకుండా లోలోపల్లే లొట్టలేసే వాళ్ళు కూడా మా ఆఫీసులో లేకపోలేదు.

"సార్! మీరు కాస్త జ్యోతీ కాన్వెంట్ ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి మా అన్నయ్య గారబ్బాయికి ఎల్.కె.జి.లో సీటిప్పించరూ!"

"సీరా గారూ! మా గ్యాస్ నంబరిస్తా. బుక్ చేసి పెట్టరూ! ఇండేన్. మరచిపోకండేం"

"రెడ్డిగారూ! మీ ఇల్లు మండలాఫీసు దగ్గరే అన్నారుగా. మా పాత రేషన్ కార్డు సరండర్ చేసి కొత్తది తెచ్చి పెట్టరూ!"

"అప్పారావ్! ఆఫీసయ్యాక అలా మా ఇంటి వేపోసారి వచ్చి వెళ్ళవోయ్. సూపర్ బజార్‌లో వెచ్చాలు తెచ్చిపెడుదువు గాని"

- ఈ విధంగా సంధ్య ఆఫీసర్ దగ్గర్నుంచి అటెండర్ వరకూ అందర్నీ తన అవసరాలకు వాడుకునేది. సురేష్ కూడా సంధ్యకు భక్తుడు కావాలని పరితపిస్తూ వుండడమూ, ఆవిడ అభిమానానికి పాత్రుడు కావాలని అర్రులు చాచడమూ నేను గమనించాను. నేను కాస్త పెద్దవాడిలా, రిజర్వ్‌డులా కన్పిస్తానో యేమో సంధ్య నాకే పనులూ ఇంతవరకూ చెప్పలేదు. మొదట్లో చిరునవ్వు నవ్వేది. ఈ మధ్య అదీ లేదు!

నేనేదో ఫైలు చూస్తూ వుంటే సురేష్ నాకు దగ్గరగా కుర్చీ లాక్కొని కూర్చొని చెప్పకొచ్చాడు. మొన్న మే నెల్లో సంధ్య డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసిందట. ఎస్.ఒ. టెస్ట్ పార్ట్ వన్ రిజల్ట్సు చూడమని నంబరిచ్చి కలెక్టరాఫీసు కెళ్ళి చూసి రమ్మంది. చూసి రమ్మంటే రామభక్తుడు కాల్చి వచ్చాడట. అలాగే సంధ్యకు సంతోషం కలిగించాలనీ, ఆ సుందరాంగి తన నంబరు తన కళ్ళతో తానే చూసుకొని ఆనందిస్తూ వుంటే ఆ కళ్ళలో కన్పించే కాంతి పుంజాల్ని తనివి తీరా ఆస్వాదించాలనీ సంధ్యోపాసకుడు సంధ్య నంబరున్న ఆ పేజీని పేజీనే పర్రుమని చింపేసి లాక్కొచ్చేశాడు!

- సురేష్ నాటకం ఫక్కీలో చెబుతూ వుంటే ఇంకేమీ వినిపించుకోకుండా ఆ పేపరు అతని దగ్గర్నుంచీ లాక్కొని లేచి వెంటనే చరచరా వెళ్ళిపోయాను.

సరాసరి కలెక్టర్ ఆఫీసుకు వెళ్ళి "ఫలానా ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసే సురేష్ అనే వ్యక్తి మీ ఆఫీసులో ఫలానా రికార్డులో నుంచీ ఫలానా కాగితాన్ని తన స్వార్థం కోసం చించి తీసికెళ్ళాడు. దాన్ని అతని నుండీ స్వాధీనం చేసుకొని పలువురి ప్రయోజనం కోసం నేను దాన్ని మీకు అప్పగిస్తున్నాను. అనుచితమైన, బాధ్యతారహితమైన అతని ప్రవర్తన పట్ల తగిన చర్య తీసుకోవలసిందిగా మిమ్మలను కోరుతున్నాను" అని ఓ పిటీషన్ రాసి, ఆ రిజల్ట్సు పేపరు దానికి గుచ్చి సూపరింటెండెంట్ గారి చేతికిచ్చి వచ్చాను.

అప్పారావిచ్చిన కవరులో దానికి సంబంధించిందే ఆ మెమో.

* * *

నా చెల్లెలు సౌజన్యకు పెండ్లి సంబంధం తెస్తాను. అంతా సిద్ధం చేసుకొని రెడీగా వుండమని భరోసా ఇచ్చిన సురేష్ ఎందుకు రాలేదో ఇప్పుడు నాకు బాగా అర్థమయ్యింది. ఎవరో ఫెళ్ళుమని చాచి గూబ మీద కొట్టినంత పనయ్యింది. నా స్వయం కృతాపరాధానికి నాకు నాకే సిగ్గేసింది. నా మీద నాకే అసహ్యం కలిగింది. ఇంట్లో చెప్పకుంటే తలా ఇంత ఉమ్మేస్తారు.

లేచి మౌనంగా నడుస్తూ బయటి కొచ్చి రోడ్డు వైపు చూస్తూ నిలబడ్డాను. ఎదురుగా ఆటో వస్తూ వుంది. ఇంటి ముందాగింది. అందులో నుంచి సురేష్ ఒక్కడే దిగాడు. సురేష్‌ని చూడగానే ఆశ్చర్యం, ఆనందం రెండూ కల్గినా రెండూ లోపల్నే అణచుకొని, నాల్గు అక్షింతలు వేసి వెళ్ళడానికే వచ్చాడని నిశ్చయించుకుని తల వంచుకొని ఇంట్లోకి నడిచాను. ఇప్పుడే వచ్చేస్తా వుండమని ఆటోవానికి చెప్పి సురేష్ లోపలికి వస్తూ "సారీ రా! అనుకోకుండా ప్రోగ్రాం మారింది. పెళ్ళికొడుకు భానుమూర్తికి సప్లిమెంటరీ వాళ్ళ ట్యూషన్లేవో తగిలాయట. ఖాళీ లేదు. వచ్చే వారం తప్పకుండా వస్తామని కబురు చేశాడు. ఈ సంగతి సకాలంలో నీకు తెలియజేద్దామనే హడావుడిగా బయలు దేరా! ఏలూరు దగ్గర రైలు గేటు పడి ట్రాఫిక్ జామ్ అయి బస్సు మూడు గంటలు లేటు. నాకు అర్జంటు పనుంది. వెళ్ళొస్తా. సంబంధం గురించి డోంట్ వర్రీ! ఈ పెళ్ళి జరిపించే బాధ్యత నాది. సరేనా! చూడు! నీ వల్ల నాకు మెమో వచ్చిందని నాకే మాత్రమూ బాధ లేదు. క్షణికమైన ఆనందం కోసం నేను చేసిన బాధ్యతా రహితమైన పనికి నీవు తగిన గుణపాఠం నేర్పావు. ఇతరులకెలాగున్నా నీ స్నేహం, నీ మనస్తత్వం నాకు మనస్ఫూర్తిగా నచ్చాయి. యువార్ మై రియల్ ఫ్రెండ్!" - అంటూ ఆటో ఎక్కేశాడు సురేష్.

సురేష్ కేసి చూస్తున్న నా కళ్ళల్లో నీళ్ళు చికాయి!